# మరోసారి ఆశీర్వదించండి

- ఐదేళ్లు సేవకుడిగా పనిచేస్తా
- బీజేపీ విధ్వంసం కోరుకుంటోంది
- కాంగ్రెస్ కబ్జా కోరులను ప్రోత్సహిస్తోంది
- ఎవరు కావాలో తేల్చుకోవాల్సింది మీరే..
- మంత్రి గంగుల కమలాకర్



నామినేషన్ సందర్భంగా తెలంగాణ చౌక్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ''కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కరీంనగర్ ప్రజలకు జన్మంతా రుణపడి ఉంటా.. మరో సారి గెలిపిస్తే ఇంకో ఐదేళ్లపాటు మీ సేవకుడిగా పని చేస్తా''నని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చారు. బుధవారం కరీంనగర్‌లో భారీ జన సందోహం మధ్య బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలి వచ్చిన జన సందోహాన్ని ఉద్దేశించి తెలంగాణచౌక్‌లో, నామినేషన్ దాఖలు చేసిన తర్వాత కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. గంగుల కమలాకర్ అంటే ఎన్నికల కోసం మాట్లాడే వాడు కాదని, మన పిల్లల భవిష్యత్తు, భావి తరాల కోసం ఆరాటపడే వాడని అన్నారు. ఇతర పార్టీల నాయకుల్లా తానెప్పుడూ ఎన్నికలప్పుడే వచ్చి మాట్లాడే వ్యక్తిని కాదని, నిత్యం ప్రజల్లోనే ఉండి, ప్రజల కోసం కష్టపడే వ్యక్తినన్నారు. మరోసారి తనను దీవిస్తే మీతో ఉండి మీ సంక్షేమం, అభివద్ధి కోసం ఒక నాయకుడిగా కాకుకండా సేవకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అభివద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటోందని, బీజేపీ మాత్రం ఇందుకు భిన్నంగా విధ్వంసాన్ని, విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలని చూస్తోందన్నారు. మరో పార్టీ కాంగ్రెస్ భూకబ్జాదారులను ప్రోత్సహిస్తోందని, ఎవరు కావాలో తేల్చుకోవాల్సింది ప్రజలేనని భారీ జన సందోహాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పదేళ్లలో సీఎం కేసీఆర్ చేసిన కృషి వల్ల హైదరాబాద్ సంపద పెరిగిందని, ఈ సంపదపై కన్నేసిన ఆంధ్రోళ్లు కాంగ్రెస్, బీజేపీ రూపంలో వచ్చి హైదరాబాద్‌పై కన్నేశారని, మనం కష్టపడి సముపార్జించుకున్న హైదరాబాద్‌ను ఆంధ్రోళ్ల చేతిలో పెడదామా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ పార్టీలని, బీఆర్ఎస్ మన హైదరాబాద్ పార్టీ అని, కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేమని తెలిపారు. రాష్ట్రం మరింత అభివద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను బలపర్చాలని కోరారు. తనపై అభిమానంతో ఇక్కడికి వచ్చిన లక్ష మంది జనం వచ్చే 30వ తేదీన బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ప్రత్యర్థుల గుండెలు అదిరి పోవాలని కోరారు. తెలంగాణ సంపద పెరిగిందని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, మళ్లీ అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలోని హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. 15 ఏండ్ల కింద నగరం ఎలా ఉందో? ఇప్పుడు ఎలా ఉందో? ఆలోచించాలని కోరారు. వేల కోట్లు తెచ్చి అభివృద్ధి చేశానని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనను మరోసారి గెలిపిస్తే కరీంనగర్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి తెస్తానని అన్నారు. సౌత్ కొరియాకు వెళ్లి అక్కడి పౌంటేన్ నమూనాను ఇక్కడి మానేరు రివర్ ఫ్రంట్‌లో ఏర్పాటు చేస్తున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ ఇరవై రోజులు తన కోసం పని చేస్తే ఐదేళ్లపాటు మీ కోసం పనిచేస్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ గెలిచే పార్టీలు కావని, మీ విలువైన ఓటును వృథా చేస్తే కరీంనగర్‌లో ఇప్పుడు జరిగే అభివృద్ధి 50 ఏండ్లు వెనక్కి పోతుందని అన్నారు. మీ కళ్ల ముందు పెరిగిన బిడ్డనని, పదవులు ఎన్ని వచ్చినా మారలేదని, ఎప్పటికీ మారనని, ఎన్ని పదవులు వచ్చినా మీ కోసమే పని చేస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ ఇప్పుడు ప్రశాంతంగా ఉందని, అందరం కలిసి మెలిసి జీవిస్తున్నామని, ఇలాంటి చోట బీజేపీ విధ్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

### అభివృద్ధి చేస్తుంటే సంజయ్‌కి కడుపుమంట

కరీంనగర్ అభివృద్ధి చెందుతుంటే బండి సంజయ్‌కి కడుపు మండుతోందని, ఎంపీగా గెలిచి ఆయన కరీంనగర్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. కేబుల్ బ్రిడ్జి కూలి పోవాలని ఆయన కోరుకుంటున్నాడని, ప్రజలపై ఆయనకు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు అమేజాన్ లాంటి అనేక కంపెనీలు వచ్చాయని, వాటిని కూడా కూలగొడతాడా ? అని మండిపడ్డారు. హిందుత్వం అని చెప్పుకునే బండి సంజయ్, బీజేపీ నాయకులు ఒక్క ఆలయం కోసమైనా కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేక పోయారని విమర్శించారు. విద్వేషాలను రెచ్చగొట్టి విధ్వంసాలు చేయడమే వారి పనని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చి అభివృద్ధి చెందిన తర్వాత ఇప్పుడు తమకు ఓట్లు వేయాలని అందరూ వస్తున్నారని, ఇందులో తనలా తెలంగాణ కోసం పోరాడిన వాళ్లు ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. కరెంట్ కోసం కొట్లాడి తనలా కాళ్లు విరగ్గొట్టుకున్న వాళ్లు ఎవరైనా ఉన్నారా? అని నిలదీశారు. తాను ఎన్ని బాధలు పడ్డా, ఎన్ని కష్టాలు పడ్డా మీకోసమేనని, తన చివరి రక్తం బొట్టు వరకు ప్రజల కోసమే ధారపోస్తానని స్పష్టం చేశారు.

### దేవుడు.. ప్రజలు నావైపే ఉన్నడు

గత ఎన్నికలో గెలవ లేక కాంగ్రెస్ నాయకుడు పొన్నం ప్రభాకర్ తనపై హైకోర్టులో వేసిన కేసు కొట్టుడు పోయిందని, దేవుడు, ప్రజలు తనవైపే ఉన్నారని మరోసారి నిరూపితమైందని మంత్రి గంగుల స్పష్టం చేశారు. ప్రజా క్షేత్రంలో తనపై గెలవ లేక దొడ్డి దారిలో అడ్డుకోవాలని చూస్తున్నారని, బండి సంజయ్ వేసిన కేసులో కూడా ఆయనకు హైకోర్టు జరిమానా విధించి మొట్టి కాయలు వేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ కేసులు కొట్టి వేయడంతో తాను కడిగిన ముత్యంలా బయటికి వచ్చానని అన్నారు. తన లాంటి ప్రజా సేవకులను అబద్ధపు కేసులతో అడ్డుకోలేరని స్పష్టం చేశారు. తనను కరీంనగర్ ప్రజలు ఇప్పటికే వరుసగా ఐదుసార్లు గెలిపించారని, కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం వెనక ప్రజలతో తనకున్న సాన్నిహిత్యమే కారణమన్నారు. దీన్ని సహించలేని ప్రతిపక్షాలు కుట్రలతో కేసులు వేస్తే న్యాయం తన పక్షాన ఉన్నందునే వీటి నుంచి ధర్మంగా బయట పడ్డానని అన్నారు. ఎన్నికల వ్యయమైనా, మరేదైనా న్యాయాన్ని, చట్టాల్ని అత్యంత గౌరవిస్తానని, ఈ తీర్పుతోనైనా ప్రతిపక్షాలు తమ కుత్సిత బుద్ధి వీడి ప్రజాక్షేత్రంలో తనను విమర్శించడం మానుకోవాలని హితవుపలికారు. రాబోయే ఎన్నికల్లోనూ తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, నాయకులు కొత్త జైపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియపై అవగాహన

**అవగాహన కల్పించిన నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారి**



అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్స్

జ్యోతినగర్, నవంబర్ 8: రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ఈవీఎం పరికరాలు, నూతన ఎన్నికల 12డీ విధానంపై బుధవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో బూత్‌లెవెల్ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఈవీఎం నోడల్ అధికారి రామ్మోహన్‌రావు, పోస్టల్ బాలెట్ నోడల్ అధికారి జ్యోతి, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ బీల్వోలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించి నూతన విధానం 12డీ అమోదించబడినట్లు పోస్టల్ బాలెట్ నోడల్ అధికారి జ్యోతి 12డీ విధానంను వివరించారు. 80ఎండ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు, కొవిడ్ బాధితులు ఇంటి వద్దనుంచి ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. మొదటగా బీల్వోలు 80ఎండ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు, కరోనా బాధితులతో 12డీ ఫామ్ దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ఆర్వోకు అందజేశారని, జాబితా మేరకు అన్ని ప్రాంతాల్లో రూట్స్‌ను విభజించి టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. 12డీ ఫామ్ ధరఖాస్తు చేసుకున్న ఓటరు పోలింగ్ బూత్‌కి రాకుండా నిబంధనలను వివరించారు. ఓటరు వెబ్‌సైట్‌లో తమ ఓటును ఫామ్ 8 ద్వారా వికలాంగులు, సీనియర్ సిటిజన్ ఓటు కింద మార్చుకున్న వారికి 12డీ విధానం వర్థించనున్నట్లు తెలిపారు. ఈ పక్రియ పూర్తికి టీమ్‌లో ఇద్దరు పోలింగ్ అధికారులు లేదా సెక్టర్ ఆఫీసర్స్, బీల్వోలు, పోలీసు స్టాఫ్ ఇద్దరు చొప్పున ఉంటారని, మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్‌తోపాటు పార్టీలకు సంబంధించి పోలింగ్ ఏజెంట్ ఉంటారన్నారు. ఓటువేసే పక్రియను రహస్యంగా ఉండేలా కంపార్టుమెంట్ కవర్ ఏర్పాటుతో ఓటువేసే విధానంను బ్యాలెట్ పత్రాన్ని కవర్లో ప్యాక్‌ను రహస్యంగా జరిగేలా చేసి ఆర్వో అధికారికి అందజేసే విధానంను వీడియో ద్వార చిత్రీకరణ పరిశీలనతో సెక్టర్ అధికారి సంతకంతో ఆర్వోకు అందజేయడం జరుగుతోందన్నారు. ఇంటినుంచి ఓటువేసే (12డీ)లో ఓటరు బాలెట్ పేపరుపై ఓటువేసిన తర్వాత బ్యాలెట్ పేపరుకు సంబంధించి 13బీ కవర్, ఓటరు డిక్లరేషన్ 13ఏ, 13సీ కవర్ ప్యాకింగ్ గురించి సెక్టర్ ఆఫీసర్స్, బీల్వోలకు సూచనలు చేశారు. నియోజకరవ్గంలో 12డీకి సంబంధించి దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య 331లో వికలాంగులు 184మంది, 80ఎండ్ల పైబడిన వృద్ధులు 147మంది ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈవీఎం పరికరాల నోడల్ అధికారి రామ్మోన్‌నావు ఎన్నికల విధానంలో ముఖ్యపాత్ర పోషించే ఈవీఎం పరికరాల పనితీరు, కమిషనింగ్ గురించి సెక్టర్ ఆఫీసర్స్‌కు శిక్షణ, పరికరాల పనితీరు, బుక్‌లెట్, వీడియో, ఫొటోల ద్వారా ప్రత్యక్షంగా వివరించారు. ఈవీఎం పరికరాల తరలింపు, పనిచేయు విధానం, సీలింగ్ వివరాలను పేర్కొన్నారు.

## బీజేపీ అభ్యర్థి ఆరెపల్లిపై కేసు నమోదు

మానకొండూర్, నవంబర్ 8 : ఎన్నికల నియామవళిలో భాగంగా కోడ్ ఉల్లంఘించినందుకు మానకొండూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్, ఆపార్టీ కార్యకర్త రమేశ్‌పై బుధవారం మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ నామినేషన్ వేయడానికి ర్యాలీ కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అనుమతి తీసుకున్నారు. అయితే, అనుమతి కన్నా ఆదనంగా ఒక గంట ఎక్కువగా ర్యాలీ తీయడమే కాకుండా పల్లెమీద చౌరస్తా వద్ద స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కేవలం ర్యాలీ కోసం అనుమతి తీసుకుని చౌరస్తాపై మీటింగ్ ఏర్పాటు చేసి ఎన్నికల నియామవళి ఉల్లంఘించడంతో మండల ఎన్నికల ఎంసీసీ టీం ఇన్‌చార్జి అక్కెపల్లి సునంద ఫిర్యాదు మేరకు బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్, ర్యాలీకి అనుమతి తీసుకున్న ఆ పార్టీ కార్యకర్త రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పార్టీల ప్రతినిధులతో ఆర్వో సమావేశం

జ్యోతినగర్, నవంబర్ 8: ఎన్నికల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఆదనపు కలెక్టర్ జే అరుణశ్రీ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎన్టీపీసీలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆర్వో ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. పోలింగ్ స్టేషన్‌ల సదుపాయాలు, పరిసరాల పరిశీలన, సోషల్ మీడియా పోస్టులపై అవగాహన, ఎన్నికల నిఘాపై వివరణ తెలిపారు. నామినేషన్ దఖాలు చేసిన అభ్యర్థులు తమ ప్రచారాలు, సభలు, సమావేశాలపై అనుమతులు సువిధ పోర్టలో 48గంటల ముందు దరకాస్తు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా పోస్టుల ఫిర్యాదుపై నియోజకవర్గ టోల్ ఫ్రీ నెంబర్ 18004256521 ద్వారా కంట్రోల్ రూమ్‌కు వివరాలను తెలియపరుచాలన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి

వేములవాడ రూరల్, నవంబర్ 8: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ రూరల్ మండలం మల్లారంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గొర్రె వెంకటేశ్ (35) కొన్ని రోజులుగా తన భార్యతో గొడవపడుతున్నాడు. కాగా ఇటీవల వెంకటేశ్‌పై భార్య కేసు పెట్టింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటేశ్ బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

CHANGE OF NAME

★ I, VIRGONI YELLAVVA, W/o. Virgoni Ramulu, R/o. 1-95, Chandrampet, Rajanna Sircilla, TS, have Changed My Name as VEERAGONI ELLAVVA, W/o. Veeragoni Ramulu.
NT-320782

★ I, MANGOLI SRINIVAS, S/o. Yella Goud, R/o. 1-5-432/5/27, Plot No. 27, Sai Nilayam, Road No. 5, Ganesh Enclave, Alwal, Hyd., TS, have Changed My Name as MANGOLI SRINIVAS GOUD, S/o. Yella Goud.
NT-320782

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194